# కొత్త రచయితలు

## లవ్ స్టోరి

**బస్ స్టాప్‌లో బస్ కోసం నిరీక్షిస్తున్న శ్రావ్యను "హలో" అని ఎవరో పలకరించడంతో వెనక్కి తిరిగి చూసింది. తన స్నేహితురాలు దివ్యను చూస్తూనే "హలో దివ్యా" అంది. ఇద్దరూ మాట్లాడుకుంటూ బస్ కోసం ఎదురు చూస్తున్నారు. అదే బస్ స్టాప్‌లో మరో ప్రక్క ఒకతను నించుని వాళ్ళనే చూస్తున్నాడు. శ్రావ్య దివ్యతో మాట్లాడుతూనే మధ్య మధ్యలో అతనిని గమనిస్తూనే వుంది. ఇంతలో బస్ రావడంతో ఎక్కడ లేని జనం ఒక్క సారిగా బస్ దగ్గరికి రావడంతో బస్ చాలా రద్దీగా వుంది.**

ఎలాగైతేనేం దివ్య, శ్రావ్య బస్ ఎక్కారు. 'హమ్మయ్య! ఇంక టైమ్‌కి ఆఫీసులో వుండవచ్చుననుకున్నారు ఇద్దరు. ముందు డ్రైవర్ ఒకటే గొడవ ఆడవాళ్ళని వెనక్కి వెళ్ళమని, వెనక నుంచి కండక్టరు మగవాళ్ళని ఫుట్‌బోర్డు మీద నిలబడ వద్దని, కాస్త లోపలికి వెళ్ళండని చెపుతున్నాడు. బస్‌స్టాప్‌లో నుంచున్నతను కూడా బస్ లోపల మధ్యలో కొచ్చి నుంచున్నాడు. శ్రావ్య, దివ్య కూడా లోపలికి వచ్చి సరిగ్గా ఆ అబ్బాయి ముందు నుంచున్నారు.

బస్ కదిలింది. కండక్టరు దివ్య, శ్రావ్యలకు కలెక్టరు ఆఫీసుకు రెండు టిక్కెట్లు ఇచ్చి, అతనిని చూస్తూనే "ఎక్కడికి" అన్నాడు కండక్టరు. "ఆంధ్రా బ్యాంక్" అన్నాడు ఆ వ్యక్తి. "ఎన్ని సార్" అన్నాడు మళ్ళీ కండక్టరు. "వన్" అన్నాడా వ్యక్తి. కండక్టరు టికెట్ ఇచ్చి వెళ్ళిపోయాడు. ఒక స్టేజి వచ్చింది. అక్కడ దిగేవాళ్ళు దిగేసరికి దివ్యకు సీట్ దొరికింది. "శ్రావ్యా నేను కూర్చుంటున్నాను. నాకు ఓపిక లేదు" అని కూర్చుంది. మళ్లీ ఎక్కేవాళ్ళతో బస్ రద్దీగా వుంది. బస్ స్టార్ట్ అయ్యింది. ఒక్కసారిగా ఎవరూ ఊహించనంతలో డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. అంతే శ్రావ్య వెనుక వున్న వ్యక్తి సడెన్‌గా వచ్చి శ్రావ్య మీద పడ్డాడు. అంతే శ్రావ్య తోక త్రొక్కిన త్రాచులా ఒక్కసారిగా వెనక్కి తిరిగి ఏయ్ మిస్టర్ అసలు నీకు బుద్ధుందా?" అని అడిగింది. "నా పేరు మిస్టర్ కాదు రాజన్. అయినా నాకు కాదు డ్రైవర్‌కి బుద్ధుండాలి" అన్నాడు. శ్రావ్య "షటప్" అంది. రాజన్, "అబ్బో ఆడవాళ్ళు కోపంలో కూడా అందంగా వుంటారు అనేది నవలల్లోనే అనుకున్నాను. కాని నిజంగానే శ్రావ్య గారూ మీరు కోపంలో చాలా అందంగా వున్నారు" అన్నాడు రాజన్. అంతే! శ్రావ్యకు తన పేరు పెట్టి పిలిచినందుకు, అలా తనని వర్ణించినందుకు కోపం ఒక్కసారిగా రాగా "యూ... షటప్" అని, "దివ్యా నువ్వు లేచి నుంచో – నేను కూర్చుంటాను. ఎవడో ఈ పోకిరీ వెధవ మ్యానర్‌లెస్‌గా బిహేవ్ చేస్తున్నాడు" అంది. దివ్య తనకు పట్టనట్టుగాను, తనను కాదులే అన్నట్లు, "నేను నించోవడానికి ఓపిక లేకనే కూర్చున్నాను. ఇంకాసేపైతే మన స్టేజ్ వస్తుంది" అంది. ఇక చేసేది లేక అలాగే వుండి పోయింది. ఇంతలో కండక్టరు రావడంతో అతనితో, "కండక్టర్ ఈ జంట్స్‌ని కొంచెం లోపలికి పొమ్మనండి" అంది. అందుకు కండక్టరు, "మీరే చూస్తున్నారు కదా మేడమ్. బస్ ఎంత రద్దీగా వుందో. బస్ చూస్తే చిన్నది. జనం చూస్తే దానికి రెండింతలు" అన్నాడు. "అలా చెప్పండి కండక్టర్" అన్నాడు రాజన్. తనలో తనే తిట్టుకుంటూ వుండిపోయింది చేసేది లేక శ్రావ్య. ఎలాగోలాగ తన స్టేజీ వచ్చేసింది. దివ్య, శ్రావ్య దిగారు. రాజన్ క్రిందికి చూస్తూ శ్రావ్యకు టాటా అని చేయి వూపాడు. శ్రావ్య దివ్యకు బస్‌లో జరిగినదంతా చెప్పి "చూడ్డానికి పెద్ద జంటిల్‌మెన్ లాగా వున్నాడు. అందంగా వున్నానని కాబోలు ఆ పొగరు" అంది కోపంగా శ్రావ్య. "అలా అని కాదు, ఆ అబ్బాయి చాలా మంచివాడు. మొన్నటి వరకు చాలా బుద్ధిగా వుండేవాడు. ఈ మధ్యలోనే..అదీ నిన్ను చూసినప్పటి నుండి!" అంది దివ్య ఏదో ధోరణిలో. శ్రావ్య కోపంగా "దివ్యా" అంది గట్టిగా. "అయితే నీకు ఇతను ఇంతకు ముందే తెలుసన్న మాట" అడిగింది శ్రావ్య. అందుకు సమాధానంగా దివ్య, "తెలుసంటే తెలుసు, తెలియదంటే తెలియదు" అంది. "అంటే?" అంది శ్రావ్య. "ఏముంది. వెరీ సింపుల్. అతనికి చదువు, సంస్కారం వుంది. అంత కంటే మంచి మనసున్న వ్యక్తి. బ్యాంక్‌లో మేనేజర్‌గా చేస్తున్నాడు. మొన్ననే ఇక్కడికి ట్రాన్స్‌ఫర్ మీద వచ్చాడు" అంది. "అయితే నువ్వు అతని గురించి అంతా తెలుసు కున్నావన్నమాట!" అంది మళ్లీ శ్రావ్య "ఆదమా ఇంటి దగ్గరే వాళ్ళిల్లు కూడాను. మా వదిన చెప్పింది రాజన్ గురించి" అంది. ఇద్దరూ ఆఫీసులో పది గంటలు కావడంతో ఎవరి సీట్లో వాళ్ళు కూర్చుని వాళ్ళ పనులు చేసుకుంటున్నారు. సాయంత్రం ఐదు గంటలకు ఆఫీసు నుండి బయటికి వస్తూ దివ్య ఏదో గుర్తుకు వచ్చిన దానిలాగ, "శ్రావ్యా! ఉదయం చెప్పటం మరిచాను. ఈ రోజు ఈవెనింగ్ మా బేబీ బర్త్‌డే. నువ్వు తప్పకుండా రావాలి" అంది దివ్య. "అలాగా! అప్పుడే బేబీకి వన్ యియరా?" అంది ఆశ్చర్యంగా. "అవును రోజులు ఎంత తొందరగా నడుస్తున్నాయి!" వాళ్ళు అలా మాటల్లో వుండగానే వాళ్ళ బస్ వచ్చింది. ఇద్దరూ ఎక్కారు, ఇద్దరికీ సీట్ దొరికింది. కూర్చున్నారు.

వాళ్ళ వెనక సీట్లోనే రాజన్ కూడా కూర్చున్నాడు. "హలో" అన్నాడు శ్రావ్యని. వెనక్కి తిరిగి చూసింది. ఆమె కళ్ళకి రాజన్ కనిపించాడు. అరికాలి మంట నడి నెత్తికి ఎక్కింది. వెంటనే కోపంతో తల తిప్పుకుంది. "దివ్యా ఈయన ఉద్దేశ్యం ఏమిటో నా కర్థం కావటం లేదు. నా వెంట పడ్డాడేంటే" అంది. అంటే "నువ్వంటే యిష్టం కాబట్టి" అంది దివ్య. ఒక్కటేసింది శ్రావ్య. "నా మీద తన కిష్టమని ఎందుకనుకోవాలి? మీ ఇంటి దగ్గరుంటాడు కాబట్టి నువ్వంటేనే ఇష్టమనుకుంటా" అంది. "నేను కాదు, నువ్వని తెలిసింది కాబట్టే" అంది. "అంటే" అంది శ్రావ్య. "అర్థం కాలేదా" అంది దివ్య నవ్వుతూ. ఏమీ మాట్లాడలేదు కోపంతో శ్రావ్య.

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి
భీమ సిమెంట్



25-10-91 ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక

# కలలో ప్రేయసి, ఇలలో శ్రీమతి

ఇద్దరి మధ్య కాసేపు మౌనం. మళ్ళీ శ్రావ్య కల్పించుకుని,"దివ్యా! తను బ్యాంక్ మేనేజరని చెప్పావుగా. తనకు స్కూటర్ లేదా? ఇలా బస్‌లో వెళ్లటం దేనికి" అంది. దివ్య "తనకు స్కూటర్ వుంది కాని తనకు బస్‌లో వెళితేనే ఇష్టం అంటే" అంది. ఇక వాళ్ళ స్టేజి వచ్చింది. ఇద్దరూ, వాళ్ళతో పాటు రాజన్ కూడా దిగాడు. దివ్య మళ్ళీ బేబీ బర్త్‌డే గుర్తుచేస్తూ "తప్పక రావాలి" అంది. "తప్పకుండా వస్తాను" అంది శ్రావ్య.

సాయంత్రం ఏడు గంటలకు శ్రావ్య దివ్య వాళ్లింటికి వచ్చింది. దివ్య వాళ్ళ అన్నయ్య లెక్చరర్ కావడంతో తన తోటి లెక్చరర్లతో ఇంకా బంధు, మిత్రులతో ఆ బంగ్లా అంతా కళకళలాడుతోంది. ఎక్కడ చూసినా లైట్స్ కాంతిలో ఆ ప్రదేశమంతా చూడముచ్చటగా వుంది. లోపలికి వెళ్ళింది శ్రావ్య. అక్కడ దివ్య బేబీని ఎత్తుకుని కూర్చుని ఎవరితోనో మాట్లాడుతోంది. హలో అంది శ్రావ్య. దివ్య అక్కడి నుంచి శ్రావ్య దగ్గరికి వచ్చింది. శ్రావ్య దివ్య చేతిలోని బేబీని ఎత్తుకుంది. వాళ్ళ అన్న వదినలతో మాట్లాడి బేబీకి ప్రజంటేషన్ ఇచ్చింది. దివ్య శ్రావ్యకి కూల్ డ్రింక్ తీసుకొచ్చి ఇచ్చి తన చేతిలోని బేబీని తీసుకుంది. శ్రావ్య మాట్లాడుతూ కూల్ డ్రింక్ సిప్ చేస్తుంటే దివ్య చేతిలోని బేబీ ఒక్కసారిగా కూల్ డ్రింక్ బాటిల్‌ని చేత్తో లాగింది. అంతే. కూల్ డ్రింక్ వచ్చి శ్రావ్య చీర మీద ఒలికింది. దివ్య "సారీ శ్రావ్యా. అక్కడ వాటరుంది రా కడుక్కుందువు గాని" అంది.

"ఫరవాలేదు దివ్యా. నేను కడుక్కుంటాసులే" అని అటు వైపు వెళ్లింది. అంతలోనే రాజన్ తను కూడా నీళ్ళ పని మీద అక్కడికి వచ్చాడు. రాజన్‌ను చూసిన శ్రావ్య "అసలు నీ




రచయిత్రి చిరునామా:

**తాళ్ళూరి విజయలక్ష్మి**

క్వార్టర్ నెం: 50/7 టైప్ II

డీజల్ కాలనీ

కాజీపేట- 506 003

ఉద్దేశ్యం ఏమిటి? నా వెంట పడ్డావు"అంది."నేను కాదు శ్రావ్య గారూ మీరు నా ముందు పడ్డారు" అన్నాడు."ఏయ్ మిస్టర్! నీ మాటలు నా దగ్గర చెల్లవు"అని కోపంగా వెళ్ళిపోయింది. లోపలికి వెళ్ళి దివ్య వాళ్ళ ఒదిన గారితో మాట్లాడుతున్న శ్రావ్యకి ఆశ్చర్యకరమైన దృశ్యం కనిపించింది. దివ్య రాజన్‌తో చాలా ఫ్రీగా మాట్లాడుతూ, నవ్వుతున్నారు వాళ్ళిద్దరు. అది చూచిన శ్రావ్యకు విపరీతమైన కోపం రావడంతో దివ్య వాళ్ళ వదిన గారితో చెప్పి వెంటనే ఇంటికి వెళ్ళిపోయింది. దివ్య కాసేపు ఆగి శ్రావ్య గురించి హాలంతా, ఇల్లంతా వెదికింది కానీ ఎక్కడా కనిపించలేదు. రాజన్‌ని అడిగింది. "నాకు తెలియదు, ఇంట్లో చూడు" అన్నాడు. హాల్లో వున్న వాళ్ళ అన్నయ్యని అడిగింది. "ఇప్పటి దాకా మీ వదినతో మాట్లాడుతోంది. లోపల మీ వదిన్ని అడుగు" అన్నాడు. అలాగే అని దివ్య లోపలికి వెళ్ళి వదిన్ని అడిగింది."ఆ!ఇప్పుడే ఇంటికి వెళ్ళిపోయింది"అని చెప్పింది.

మర్నాడు బస్‌స్టాప్‌లో"హలో శ్రావ్యా. నిన్న నాకు చెప్పకుండానే వచ్చేసావేం? నీ గురించి చాలాసేపు వెదికాను కాని నువ్వు కనబడలేదు. ఆ తరువాత వదిన చెప్పింది నువ్వు వెళ్ళిపోయావని" అంది. ఇంత వరకూ దివ్య మాట్లాడుతున్నా శ్రావ్య మాత్రం ఎటో చూస్తూ వుండిపోయిందే కాని ఒక్క మాట మాట్లాడలేదు."నిన్నే శ్రావ్యా ఏమీ మాట్లాడ వేమి"అంది మళ్ళీ దివ్య."నేను నీతో అసలు మాట్లాడను"అంది కోపంగా శ్రావ్య. "ఎందుకు? నేను చేసిన తప్పేమి"అడిగింది దివ్య. "ఇంకా నేనే చెప్పాలా, నీకు తెలియదూ"అడిగింది శ్రావ్య."నిజంగా శ్రావ్యా తెలియదు చెప్పి అప్పుడు తిట్టు పడతాను"అంది సౌమ్యంగా దివ్య."నిన్న రాత్రి నువ్వు ఆ రాజన్‌తో అంత ఫ్రీగా మాట్లాడడం"అంది గుర్తుకు తెస్తున్నట్టు శ్రావ్య. దానికి దివ్య"ఓ అదా! చెప్పానుగా అతను మా ఇంటి ప్రక్కనని. అంత ఫ్రీ గనుకనే నువ్వంటే తనకి ఇష్టం అని చెప్పాను నిన్న"అంది."అంటే?"అవును అతను నాకు చెపుతాడు. నువ్వంటే చాలా ఇష్టం. అతను ఎప్పుడు నీ గురించే కలలు కంటాడు. అతని కలలు నిజం చేస్తావో లేక కల్లలు చేస్తావో నీ ఇష్టం" అంది దివ్య. ఏమీ మాట్లాడకుండా వుండిపోయింది శ్రావ్య.

ఇలా నెలరోజులు గడిచాయి. ఒకరోజు సడన్‌గా టెలిగ్రామ్ వచ్చింది. వెంటనే ఊరు వెళ్ళాలి. అందుకు లీవ్ లెటర్ వ్రాసి దివ్యకిచ్చి వెళదామని దివ్య వాళ్ళింటికి వెళ్ళింది శ్రావ్య.

అప్పుడు టైం సాయంత్రం 7 గంటలు.

తలుపు తట్టిన శ్రావ్యకు తలుపు తెరచి ఎదురుగుండా నిల్చున్న వ్యక్తిని చూసిన శ్రావ్యకు ఏమి మాట్లాడాలో తెలియలేదు."నువ్వా"అంది కోపంగా."అవును"అన్నాడా వ్యక్తి."దివ్యా"అని పిలిచింది లోపలికి చూస్తూ. "రండి లోపలికి" అన్నాడు రాజన్."నువ్వంటే అసలు రాను,"అని "దివ్యను పిలిస్తే చాలు"అంది."సరే అయితే! నేనే బయటికి వెళుతున్నాను. మీరు లోపలికి వెళ్లండి" అని బయటికి వచ్చాడు. శ్రావ్య లోపలికి వెళ్ళిన వెంటనే రాజన్ లోపలికి వచ్చి గడియ పెట్టాడు. శ్రావ్య ఊహించని సంఘటనకి భయంతో ఒణికి పోయింది. "దివ్యా, దివ్యా" అని పిలవసాగింది. రాజన్ ఇంతలో"ఎవరూ లేరు ఇంట్లో. అందరూ సినిమాకి వెళ్ళారు" అన్నాడు. "అయితే వాళ్ళందరూ సినిమాకి వెళితే మరి నువ్వు ఇక్కడేం చేస్తున్నావు?"అంది ఒణుకు తున్న కంఠంతో."నేను సినిమాక వెళ్లలేదు, ఇంట్లోనే వున్నాను"అని రాజన్ అన్నాడు. అతనేం చేస్తాడో అన్న భయంతోనూ, ఇంతకు ముందు అతని మీద వున్న చెడు అభిప్రాయం తోను బయటికి వెళ్ళడానికి ప్రయత్నించింది శ్రావ్య. కాని రాజన్ తలుపు దగ్గరే నిలబడ్డాడు అది గమనించి. ఇక చేసేది లేక శ్రావ్య అలాగే నుంచుంది. రాజన్ "కూర్చోండి" అన్నాడు. కూర్చోలేదు శ్రావ్య. గట్టిగా మళ్ళీ"కూర్చోండి" అన్నాడు. భయానికి ఒక్కసారిగా కూర్చుంది. టేబుల్ మీద వున్న ఫ్లాస్క్‌లోని కాఫీని కప్పులోకి వంపి శ్రావ్యకి అందిస్తూ "తీసుకోండి" అన్నాడు. మరియాదలకేమీ తక్కువ లేదనుకుని, మళ్లీ ఎక్కడ అరుస్తాడో అని గబుక్కున తీసుకుంది. కాఫీ సిప్ చేస్తూందే కాని శ్రావ్యకు ఇంతకీ ఈయన ఇక్కడ ఎందుకు వున్నట్లో అర్థం కాలేదు."ఇక వెళతాను"అని ఒణుకుతున్న చేత్తో కప్పు టేబుల్ మీద పెట్టి లేచింది శ్రావ్య. ఇదంతా గమనిస్తున్న రాజన్‌కు చెప్పలేనంత నవ్వు వస్తున్నా ఆపుకుంటున్నాడు."ఎందుకు వచ్చారో చెప్పనే లేదే"అన్నాడు రాజన్."చెల్లికి ఏం చెప్పాలి?"అన్నాడు మళ్లీ. ఒక్కసారిగా"వాట్? దివ్య మీ సిస్టరా" అంది ఆశ్చర్యంగా."ఏం మీకు తెలియదా? మీ ఫ్రెండ్ దివ్య నా చెల్లెలు. నేను దానికి చిన్న అన్నయ్యను అని చెప్పాడు. శ్రావ్య"మరి దివ్య నాకు ఎప్పుడూ ఈ విషయమే అసలు చెప్పలేదు. ఈ మధ్యలో కూడా మీరు ప్రక్కింటి వాళ్ళని అనటమే కాని అన్నయ్యని ఎప్పుడూ చెప్పలేదు"అంది."నేను మిమ్మల్ని పది సంవత్సరాలుగా- అంటే మీరు స్కూల్‌లో వున్నప్పటి నుంచి లైక్ చేస్తున్నాను. అయితే నేను విజయవాడలో వుండేవాడ్ని. ఇన్ని రోజులు నా చదువు, ఉద్యోగం అన్నీ కూడా అక్కడే వుండేవి. ఈ మధ్యలోనే ఇక్కడికి వచ్చాను. ఎప్పుడు వచ్చినా రెండు, మూడు రోజులు వుండి వెళ్లేవాడిని. అప్పుడు మీరు, దివ్య దిగిన ఫోటో కనిపించింది. అది తీసుకుని వెళ్ళాను. అప్పటి నుంచి ఆ ఫోటోని చూస్తూ నా కలలు మీ మీద!"అన్నాడు. తను సహజంగానే మంచి వాడని, తనను దివ్య చెప్పినట్లు గాఢంగానే ప్రేమిస్తున్నాడని ఒక్క క్షణంలో అర్థమైంది శ్రావ్యకు. తన తప్పు తెలుసుకున్న శ్రావ్య సిగ్గుతో తల క్రిందకు వంచుకుని"అయామ్ సో సారీ" అంది. "ఫరవాలేదు. ఇప్పటికైనా నన్నర్థం చేసుకున్నారు. అంతే చాలు"అన్నాడు."ఇన్నాళ్లకి నా మనసులోని మాట మీకు చెప్పగలిగినందుకు థాంక్యూ"అన్నాడు."ఇంతకీ వచ్చిన పని చెప్పలేదు" అడిగాడు రాజన్."దివ్యకి లీవ్ లెటర్ ఇవ్వాలి" అంది మెల్లగా."ఎందుకు"అడిగాడు రాజన్."మా అంకుల్ సీరియస్ అని టెలిగ్రామ్ వచ్చింది. రేపు వెళ్లాలి"అంది."మళ్లీ ఎప్పుడు రావడం?" అన్నాడు. "వారం రోజుల తరువాత!"అంది. "అమ్మో వారం రోజుల వరకూనా"అన్నాడు. తల పైకెత్తి చూసింది."ఏం వారం రోజులే కదా"అంది శ్రావ్య."మీకేం! మీకు వారం రోజులు అంటే తక్కువగా కనిపించ వచ్చు. నాకు మాత్రం క్షణమొక యుగంలా వుంటుంది" అన్నాడు. "అలాగైతే మరి పదేళ్ళు ఎలా ఆగారు"అంది శ్రావ్య."ఆ రోజులన్నీ ఒక కలలా జరిగిపోయినవి. వాటిని ఇప్పుడు గుర్తు చేయకండి ప్లీజ్"అన్నాడు బాధగా."సరే అయితే నేను వెళుతున్నాను. ఇదిగో లీవ్ లెటర్. దివ్యకివ్వండి"అని లేచింది."ఆ చెప్పటం మరిచాను"అన్నాడు ఏదో గుర్తుకు రావడంతో."ఏంటి"అని చూసింది."ఏమీ లేదు. మిమ్మల్ని నా చేష్టలతో బాధించినందుకు సారీ" అన్నాడు."సరి సరి ఇక నేను వెళుతున్నాను"అని తలుపు దగ్గరికి వెళ్లింది. రాజన్ తలుపు తీశాడు. బయటికి వెళుతున్న శ్రావ్య చేతిని తన చేతిలోకి తీసుకుని ముద్దు పెట్టుకున్నాడు. అంతే శ్రావ్య అణువణువూ ఒక్కసారిగా పులక రించింది. చేయి లాక్కుని సిగ్గుతో ఒక్క పరుగు తీసింది.

వారం రోజులు గడచిపోయాయి. బస్‌స్టాప్‌లో "హలో శ్రావ్య గారూ" అనే పిలుపుతో వెనక్కి తిరిగి చూసి శ్రావ్య"హలో"అంది చిరునవ్వుతో. "ప్రయాణం కులాసాగా జరిగిందా? మీ అంకుల్ ఎలా వున్నారు"అని అడిగాడు రాజన్. అన్నీ చెప్పి

శ్రావ్య "దివ్య రాదా" అని అడిగింది. "వస్తుంది కాని కాస్త లేట్" అన్నాడు. "మరి మీ రిద్దరూ ఒక్కసారే రావచ్చుగా" అంది శ్రావ్య. "రావచ్చు కాని బేబీకి దివ్య అంటే చాలా ఇష్టం. అందుకని దాన్ని వదిలించుకునేసరికి ఈ టైమ్ అవుతుంది!" అని వెనక్కి తిరిగిన రాజన్, "అదిగో వస్తుంది దివ్య" అన్నాడు. "హలో శ్రావ్యా! బాగున్నావా" అని అడిగింది దివ్య. "నేను నీతో మాట్లాడను" అంది శ్రావ్య. "ఎందుకు? మీరిద్దరూ ఫ్రెండ్స్ అయినందుకా?" అని, "అవునులే నేను పాత స్నేహితురాలిని కదా" అంది కోపంగా. "అది కాదులే. నువ్వు రాజన్ మీ అన్నయ్య అని చెప్పలేదు ఎప్పుడూను. నేను ఎన్ని తిట్టినా సరే అలాగే వుండేదానివి!" అంది శ్రావ్య. "ఎప్పుడైనా చెప్పనిస్తేనా అసలు. అన్నయ్య పేరంటేనే విరుచుకుపడేదానివి. ఇక అన్నయ్య గురించి కూడానా" అంది నవ్వుతూ దివ్య. ఇంతలో బస్ రావడంతో రాజన్ "దివ్యా బస్" అన్నాడు.

"రా శ్రావ్యా ఎక్కుదాము" అంది. ముగ్గురూ ఎక్కారు. మళ్లీ మొదటిలాగానే శ్రావ్య, రాజన్ నిలబడ్డారు. ఇప్పుడు మాత్రం కోపం లేదు శ్రావ్యకి. చక్కగా మాట్లాడుకుంటున్నారు.

ఇలా రోజులు గడుస్తున్నాయి. రాజన్, దివ్య, శ్రావ్యలు సినిమాలకి, షికార్లకు వెళుతు న్నారు, వస్తున్నారు. ఒకరోజు దివ్య ఒంట్లో బాగోలేదని ఆఫీస్‌కి రాలేదు. శ్రావ్య, రాజన్ ఈవెనింగ్ పార్క్‌కి వెళ్లి కూర్చున్నారు. రాజన్ శ్రావ్యని "నేను నేను నిన్ను పెళ్లి చేసుకునేం దుకు ఇంకా ఏం లేట్" అడిగాడు రాజన్ శ్రావ్య ఒళ్ళో పడుకుని. "ఏం వుంది, మీరు మా అమ్మ, నాన్నగారిని అడగండి" అంది. "అమ్మో" అని ఒక్కసారి లేచి కూర్చున్నాడు. "ఎందుకంత భయం" అంది శ్రావ్య. "మరి మీరు బ్రాహ్మణులు, మరి మేము" అని ఒక్కసారి ఆగిపోయాడు. "ఇలాంటప్పుడు మీ నాన్నగారు ఒప్పుకుంటారా" అని అనుమానంగా అడిగాడు శ్రావ్యని. "ఓ అదా! దానికేముంది. మీరు ఇంచుమించు కులానికి దరిదాపులోనే వున్నారు. అదీ కాక నాన్నగారు మునపటి అంత చాదస్తం లేదు. అబ్బాయి యోగ్యుడు, మంచివాడు, ఉద్యోగస్తుడు అయితే చాలు. అన్ని సుగుణాలు మీలో వున్నాయి. ఇకపోతే కులాల పట్టింపు లేదు. ఇక మీ కుటుంబ విషయాలు చిన్నప్పటి నుండి చూస్తున్నాను. నేను, దివ్య కలసి చదువుకున్నాం. ఇప్పుడు కలసి ఉద్యోగం కూడా చేస్తున్నాము. రేపే మంచి రోజు. మీ అన్నయ్య, వదినలతో వచ్చి అడగండి" అంది. ఇద్దరూ ఇంటి ముఖం పట్టారు.

మరునటి ఉదయం ఆదివారం కావడం వల్ల అందరూ ఇంట్లోనే వున్నారు. రాత్రే శ్రావ్య వాళ్ళ అమ్మతో విషయం చెప్పడం వల్ల వీళ్ళు రెడీగానే వున్నారు. ఉదయం 8 గంటలకు దివ్య వాళ్ళ కుటుంబం మొత్తం వచ్చింది. ఒక కలలా పెళ్ళిచూపులు, పెళ్ళి కావడం అన్నీ ఒక నెలలో కావడం జరిగిపోయింది....ఏదో పరధ్యానంగా ఆలోచిస్తున్న రాజన్‌ను చూసి "ఏమండోయ్ శ్రీవారూ! ఏంటీ నా పిలుపు కూడా వినబడనంత పరధ్యానం?" అంది శ్రావ్య రాజన్‌ను చేత్తో తడుతూ.

రాజన్ ఒక్కసారిగా ఉలిక్కిపడి, శ్రావ్య రెండు భుజాల మీద తన రెండు చేతులు వుంచి "శ్రావ్యా నేను నిన్ను పెళ్ళి చేసుకోవటం కలలో కూడా జరగదనుకున్నాను. కాని నిజంగా జరిగింది. కలలో నా ప్రేయసి, ఇలలో ఈ శ్రీమతి" అని శ్రావ్యని ముందుకు వంగి ముద్దు పెట్టుకున్నాడు.

●●●●●




"మా వంట ఇంటిలో మిక్సర్-గ్రైండర్ వున్నప్పటికీ, నేను ఒక "బాస్ పోర్టబుల్ బ్లెండర్" ను కూడా కలిగియున్నాను. అది లేకుండా వంట ఇంట్లో నేను ఏ పని చేయలేను.

నా వంట ఇంటికి అది ఒక గర్వకారణం. ఆ ఒక్కటి లేకుండా మీ పరిస్థితి ఎలా వుంటుందో ఊహించండి.



మీ వంట ఇంటి సమస్యలు
తగ్గించడానికి అదనంగా మరో చక్కటి అమరిక

BOSS
PORTABLE
BLENDER

చూడముచ్చటైనది, నిర్వహణలో ఉత్తమమైనది.
శుభ్రపరచి దాచుకొనుటకు తేలికైనది. మరియు చాలా పొదుపైనది.
సెంకన్లలో మీరు ఆహ్వానించిన అతిథులకు అద్భుతమైన ఏర్పాట్లు సిద్ధం.
పరిశుభ్రంగా మిశ్రమమునకు, చిలుకుటకు, కలుపుటకు, రసం పిండుటకు
మీకు స్నేహపూర్వకంగా ఉపయుక్తమైనది.
అది మీకు కుడిచేయి లాంటిది.

విద్యుత్ ద్వారా పని చేస్తుంది.
2 స్పీడ్స్ &
230V AC





బహుమతిగా చక్కటి ఎంపిక

డిస్ట్రిబ్యూటర్లు:
పద్మావతి ఎంటర్‌ప్రైజెస్
4-8-662, రామమందిరం ఎదురుగా గౌలిగూడ, సిటీబస్ డిపో రోడ్
హైదరాబాద్ -500 012
ఫోన్: 4319